**2023** • నాడు ఏడాది పొడవునా మత్తడులు

**2024** • నేడు నీటి కోసం ఎదురుచూపులు

ఇది మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని తాళ్లపూసపల్లి చెరువు. ఈ చెరువు పూర్తి నీటిమట్టం 60.7మిలియన్ క్యూబిక్ ఫీట్లు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని మిడ్‌మానేరు నుంచి ఎస్సారెస్పీ డీబీఎం-48 ద్వారా నీటిని తెచ్చి ఈ చెరువును నింపారు. అంతే కాకుండా ఈ చెరువుకు అదనంగా 100 క్యూసెక్కుల నీరు ఇవ్వడం ద్వారా ఏడాది పొడవునా మత్తడి పోసేది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టుల నుంచి నీళ్లు వదలకపోవడంతో చెరువు ఇలా మారిపోయింది.
- మహబూబాబాద్

### మోటర్ పెడితే గోలెం నిండుతలేదు

నాకున్న ఐదెకరాల్లో పొలం పెడితే నీళ్లు లేక నెర్రెబారింది. ఇప్పుడు మోటర్ పెడితె గోలెం నిండుతలేదు.. పదేళ్లు పుష్కలంగా నీళ్లు వచ్చినయ్. నాట్లు పెట్టేటప్పుడు నీళ్లుండె.. ఈసారి కాల్వ వదులుతారనే ధైర్యంతో వరి పెట్టా. కానీ ఇప్పుడు సర్కారు పట్టించుకుంట లేరు. పంటకు పెట్టిన పెట్టుబడి మునుగుడే. అప్పుల పాలే. ప్రభుత్వం నుంచి ఏ సాయం అందలే. ఇట్లుంటె రైతుకు కష్ట కాలమే.
- గుంటి యాదగిరి, సీతారాంపురం, దేవరుప్పుల, జనగామ

# కడుపు మండి..పంటకు నిప్పు

కరీంనగర్, మార్చి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా 13 మండలాల్లో కరువుఛాయలు కనిపిస్తున్నాయి. కేసీఆర్ పాలనలో కాళేశ్వరం జలాలను రాజరాజేశ్వర రిజర్వాయర్ (మధ్యమానేరు) ద్వారా అన్నపూర్ణ రిజర్వాయర్‌కు ఎత్తిపోసేది. ఈ రిజర్వాయర్‌లో ఓవర్ ఫ్లో అయిన నీరు పక్కనే ఉన్న అనంతారం చెరువులోకి వెళ్లేది. దీంతో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండేవి. ఫలితంగా పెద్దలింగాపూర్ రైతులు వేలాది ఎకరాల్లో వరి పంటలు వేసి మోటార్ల ద్వారా పారించుకునేది. ప్రస్తుతం కాళేశ్వరం ద్వారా నీళ్లు ఎత్తిపోయక పోగా మధ్యమానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీళ్లు ఇవ్వడం లేదు. దీంతో అన్నపూర్ణ రిజర్వాయర్ వట్టిపోయే పరిస్థితి రాగా, అనంతారం చెరువు ఎండిపోయి భూగర్భజలాలు అడుగంటిపోయాయి. పెద్దలింగాపూర్ గ్రామంలోని చేతికొచ్చే దశలో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ఎండి పంటలను చూడలేక సోమవారం రైతులు వరి పొలానికి నిప్పు పెట్టారు. నెల రోజులు గా నీళ్లివ్వాలని రోడ్డెక్కుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ సిరికొండ, పెద్దలింగాపూర్ తదితర గ్రామాల్లో ఎండిపోతున్న పంటలను పరిశీలించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు.

నీళ్లు లేక ఎండి పోయిన వరి పంటను తగులబెడుతున్న ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ రైతులు

### పుట్టెడు దుక్కం వస్తాంది

పోయినసారి లెక్కనే ఈ సారి కూడా నీళ్లత్తయని నాలుగెకరాలు ఏసిన. తొమ్మిదేండ్ల సంది ఏ రందీ లేకుండా వరి సాగు చేసుకున్నం. కానీ, ఈ యాసంగిల నీటికి గోసయితంది. ఇంకో పదిహేను రోజులైతే పంట కోతకు వచ్చేది. ఇప్పుడు బాయికాడికి పోతే పంటను చూసి పుట్టెడు దుక్కం వస్తాంది. ఏం చేసినా పొలం పారే పరిస్థితి లేదు. లాగోడి మీద పడి అప్పుల పాలవుడే. ఇప్పటి వరకు పంటలను ఎవరూ పరిశీలించలే. ఎమ్మెల్యే కన్నెత్తి చూడలె. కాంగ్రెస్ సర్కారు ఆదుకోవాలి.
- గుర్రాల బుచ్చవ్వ, పెద్దలింగాపూర్,

## బావిలో పడి ఒకరి మృతి

**పూడిక తీస్తుండగా ఊడిన క్రేన్ వైరు**

భీమదేవరపల్లి, మార్చి 11 : పూడిక తీసేందుకు బావిలోకి దిగుతుండగా క్రేన్ వైరు తెగి ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఖానాపూర్‌కు చెందిన రెడ్డి కుమారస్వామి ఐదేండ్లుగా తన అత్తగారి ఊరైన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఉంటున్నాడు. క్రేన్ పని చేసే కుమారస్వామి ఎనిమిది రోజులుగా మారుపాక రాజమొగిళి వ్యవసాయ బావి పూడిక తీస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం మొదటగా ఇద్దరు కూలీలు అలుగు వెంకటేశ్, మారుపాక రమేశ్ క్రేన్ డబ్బా ద్వారా బావిలోకి దిగారు. అనంతరం క్రేన్ నడుపుతున్న కుమారస్వామి భార్య రమాదేవికి చెప్పి బావిలోకి దిగేందుకు క్రేన్ డబ్బా ఎక్కాడు. ప్రమాదవశాత్తు క్రేన్ గేరు వైరు ఊడిపోవడంతో కుమారస్వామి బావిలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కండ్లముందే భర్త మరణంతో భార్య రమాదేవి రోదనలు మిన్నంటాయి. ముల్కనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద హనుమకొండ -సిద్దిపేట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

# సాగునీటి కోసం వంటావార్పు

నంగునూరు, మార్చి 11: సాగు నీరు విడుదల చేసి పంట పొలాలను రక్షించాలని సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద సోమవారం హనుమకొండ - సిద్దిపేట రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఎడ్ల సోమిరెడ్డి, సొసైటీ చైర్మన్ కోల రమేశ్‌గౌడ్ రైతులకు ఆందోళనకు మద్దతు తెలిపారు. రెండు రోజుల్లో సాగునీరు అందకుంటే పంటలు పూర్తిగా ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి పెద్ద వాగులోకి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో విషయాన్ని ఇరిగేషన్ డీఈఈ చంద్రశేఖర్ దృష్టికి ఎస్ఐ తీసుకెళ్లారు. డీఈఈ చంద్రశేఖర్ సంఘటనా స్థలానికి చేరుకుని సాగునీరు అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

**రైతుల వంటావార్పు**

కమలాపూర్, మార్చి 11: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల గ్రామంలో పరకాల-హనుమకొండ రహదారిపై శ్రీరాంలపల్లి, గూనిపర్తి, అంబాల గ్రామాల రైతులు సోమవారం సాగునీటి కోసం రోడ్డెక్కారు. రహదారిపై బైఠాయించి వంటావార్పు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎస్సారెస్పీ అధికారులు డీబీఎం 24కు సరిపడా నీటిని విడుదల చేయకపోవడంతో పంటలు ఎండుతున్నాయని పేర్కొన్నారు. కాకతీయ కాలువ గేటు కూడా పూర్తిస్థాయిలో లేపకపోవడంతో చివరి ఆయకట్టుకు నీళ్లు అందడంలేదని అన్నారు. వరి పొట్టదశలో, మక్కజొన్న పీసు వేస్తుండడంతో అధికారులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాలువ నీళ్లు రాకపోతే 500 ఎకరాల్లో పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. కమలాపూర్, హసన్‌పర్తి పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఎస్సారెస్పీ అధికారులు వచ్చే వరకు ధర్నా విరమించేది లేదని రైతులు చెప్పడంతో అక్కడికి వచ్చిన ఎస్సారెస్పీ ఏఈ రాకేశ్ నీళ్లు వదలటం తన పరిధిలో లేదని చేతులెత్తేశాడు. సీఐ హరికృష్ణ ఎస్సారెస్పీ ఎస్ఈ వద్దకు తీసుకెళ్తానని చెప్పడంతో రైతులు ధర్నా విరమించారు.

పరకాల-హనుమకొండ రహదారిపై వంటావార్పు చేసి నిరసన తెలుపుతున్న రైతులు

## ఒక్క ఎకరమూ ఎండనివ్వను

**మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం**

నస్రుల్లాబాద్, మార్చి 11: బాన్సువాడ నియోజకవర్గంలో ఒక్క ఎకరం కూడా ఎండిపోకుండా పంటలను కాపాడుతామని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి రైతులకు భరోసా ఇచ్చారు. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రంలోని నల్లజెరు చెరువును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ యాసంగిలో నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలో అలీసాగర్ వరకు 1.30 లక్షల ఎకరాలకు ఏడు విడతలు గా సాగునీరందించడానికి ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం ఆరో విడత నీటి విడుదల కొనసాగుతున్నదని, రైతులు నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.

బీర్కూర్‌లోని చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

## కాంగ్రెస్ సర్కారుకు రైతుల ఉసురు

- నీళ్లున్నా ఇవ్వని అసమర్థ ప్రభుత్వం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి ఫైర్

దేవరుప్పుల, మార్చి 11 : రిజర్వాయర్లలో నీళ్లుండి ఇవ్వలేని అసమర్థ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగుల్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం జనగామ జిల్లా దేవరుప్పుల మండలంలోని ధరావత్ తండా, ధర్మగడ్డ తండా, సీతారాంపురం, ధర్మాపురం, పాలకుర్తి మండలం మైలారం టీకే నాయక్ తండా, మల్లంపెల్లి బీకేనాయక్‌పెద్ద తండాలో ఎండిన పంట పొలాలను రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో గుంట మడి ఎండకుండా పదేండ్లు నీళ్లిచ్చామని, ఇప్పుడేమొచ్చిందని ప్రశ్నించారు. రిజర్వాయర్లలో నీళ్లు ఉన్నా అవగాహన లేని మంత్రులు, సమన్వయంలేని అధికారగణం వల్లే ఈ సమస్యలు వస్తున్నాయని అన్నారు. కరువును ఎదుర్కొనేందుకే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూపకల్పన చేసినట్లు చెప్పారు. రివర్స్ పంపింగ్‌తో సగం తెలంగాణ సుభిక్షం చేసే వీలుంటుందని తెలిపారు. ఇంత మంచి ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతులతో రాజకీయలొద్దని.. ఇకనైనా నీళ్లు వదిలి రైతులను ఆదుకోవాలని కోరారు. నీళ్లు లేక ఎండిపోతున్న పంటలకు నిరసనగా 12వ తేదీన మండల కేంద్రంలో ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దయాకర్‌రావు చెప్పారు.



జనగామ జిల్లా దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో ఎండిన పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్‌లో తగ్గిన నీటిమట్టంతో తేలిన మట్టి గడ్డలు

## డెడ్ స్టోరేజీకి గుండారం రిజర్వాయర్

**ఆందోళనలో ఆయకట్టు రైతాంగం**

కమాన్‌పూర్, మార్చి 11 : పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలోని గుండారం రిజర్వాయర్ డెడ్ స్టోరేజీకి చేరుకున్నది. కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం, మంథని మండలాల కల్పతరువు అయిన ఈ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తగ్గడంతో మట్టి గడ్డలు తేలుతున్నాయి. ఎస్సారెస్పీకి అనుబంధంగా గుండారం గ్రామంలో నిర్మించగా, ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు కూడా అనుసంధానంగా ఏటా రెండు టీఎంసీలు తరలించేందుకు పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఒకవైపు ఎస్ఆర్ఎస్పీ నుంచి, మరో వైపు ఎల్లంపల్లి నుంచి రిజర్వాయర్‌కు సాగు నీరు సరఫరా చేసే అవకాశాలు ఏర్పడ్డాయి. అయితే, ఏప్రిల్ 15 వరకు వారబంధీ పద్ధతిలో ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేయాల్సి ఉన్నా సరిగా రావడం లేదు. ఇటు ఎల్లంపల్లి నుంచి కూడా నీటిని ఎత్తిపోయడం లేదు. దీంతో దిగువన ఉన్న చెరువులు, కుంటలు నింపలేని పరిస్థితి ఏర్పడగా, ప్రస్తుత సర్కారు నిర్లక్ష్యంతో ఈ రిజర్వాయర్ కూడా వట్టిపోయే పరిస్థితి నెలకొన్నది. రిజర్వాయర్ సామర్థ్యం 0.08 టీఎంసీలు కాగా, 12 అడుగుల ఎత్తు ఉన్నది. ఇందులో 8 ఫీట్ల ఎత్తు వరకు నీటి నిల్వలు ఉంటేనే దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేయొచ్చు. అయితే, ప్రస్తుతం గేట్లు ఎత్తినా నీళ్లు బయటి వెళ్లలేని పరిస్థితికి చేరుకున్నది. అధికారికంగా 28,800 ఎకరాలకు సాగు నీరందించాల్సి ఉండగా, ప్రస్తుతం 20 వేల ఎకరాలకు కూడా నీటిని అందించలేని పరిస్థితి నెలకొన్నది.

## నదీ జలాలపై సమీక్ష చేయాలి

- సాగునీటిపై సర్కారు తీవ్ర నిర్లక్ష్యం
- హామీలు అమలు చేయకపోతే ప్రజల నుంచి దండన తప్పదు
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

హైదరాబాద్, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో రైతాంగం సమస్య చాలా తీవ్రంగా ఉందని.. కొత్త ప్రభుత్వం నదీ జలాలపై తక్షణం సమీక్ష చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి 90 రోజులైనా సాగునీరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిలో నీళ్లు వృథాగా పోతున్నాయని, 4 టీఎంసీల నీళ్లను సముద్రంలోకి ఎందుకు వదిలిపెట్టారో సమాధానం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మీటింగ్‌లో కరెంట్ పోతేనే కరెంట్ గుర్తు వస్తుందని ఎద్దేవా చేశారు. 5 ఎకరాల లోపు రైతులకు ఇంత వరకు రైతుబంధు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బోనస్ ఇచ్చి వడ్లు కొంటామని రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, యాసంగి క్రాప్ లోన్లపై సమీక్ష చేయాలని సూచించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ప్రజల నుంచి దండన తప్పదని హెచ్చరించారు.

### ర్యాలంపాడులో మొసలి కలకలం

*జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండలం ర్యాలంపాడు శివారులోని వ్యవసాయ పొలంలో సోమవారం గ్రామస్థులు భారీ మొసలిని గుర్తించారు. ర్యాలంపాడు రిజర్వాయర్‌లో నీళ్లు అడుగంటడంతో అక్కడి నుంచి గ్రామ శివారులోని రంగారెడ్డి అనే రైతు పొలంలో ముండ్ల చెట్ల పొదల్లో మొసలి ప్రత్యక్షమైంది. దీంతో బెంబేలెత్తిపోయిన రైతులు తాళ్లతో మొసలిని బంధించారు. అటవీ శాఖ అధికారులు వచ్చి దాదాపు 130 కిలోల బరువు ఉన్న ఈ మొసలిని జూరాల ప్రాజెక్టులో విడిచిపెట్టారు.* – ధరూరు

## మార్క్‌ఫెడ్‌లో జీఎం చిచ్చు!

- విష్ణువర్ధన్‌రావును సరెండర్ చేస్తూ బోర్డు నిర్ణయం
- అప్రూవ్ చేసేది లేదన్న వ్యవసాయ శాఖ కార్యదర్శి
- కార్యదర్శి తీరుపై బోర్డు సభ్యుల అసహనం

హైదరాబాద్, మార్చి 11(నమస్తే తెలంగాణ): మార్క్‌ఫెడ్‌లో జీఎం విష్ణువర్ధన్‌రావు సరెండర్ వ్యవహారం ఉత్కంఠ మలుపు తిరిగింది. విష్ణువర్ధన్‌ను ప్రభుత్వానికి సరెండర్ చేయడాన్ని వ్యతిరేకిస్తున్న వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు దీనిపై మార్క్‌ఫెడ్ బోర్డు సభ్యులను ప్రశ్నించడంతో స్వల్ప వాగ్వివాదం కూడా జరిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో విష్ణువర్ధన్‌రావు సరెండర్‌ను తాను అప్రూవ్ చేయబోనని రఘునందన్‌రావు తేల్చిచెప్పినట్టు తెలిసింది. దీంతో ఈ వివాదం ఎక్కడి వరకు వెళ్తుందోననే ఉత్కంఠ కొనసాగుతున్నది. కోఆపరేటివ్ అధికారి అయిన విష్ణువర్ధన్‌రావు గత ఐదేండ్లుగా మార్క్‌ఫెడ్‌లో జనరల్ మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. ఫిబ్రవరితో డిప్యూటేషన్ గడువు ముగిసింది. అయితే ఎండీ సత్యనారాయణరెడ్డి కొత్తగా రావడం, ఫైనాన్స్ అధికారి లీవ్‌లో ఉండటంతో ప్రస్తుత జీఎం వెళ్లిపోతే పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో డిప్యూటేషన్‌ను మరోసారి పొడగించేందుకు ఫైల్ ప్రాసెస్ చేశారు. దీనిపై బోర్డు సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. తొలి నుంచి జీఎం విష్ణువర్ధన్‌రావుపై బోర్డు సభ్యులు తీవ్ర అసహనంతో ఉన్నారు. దీనికితోడు జీఎం మార్క్‌ఫెడ్ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించకుండా తమను ఇబ్బందుల్లోకి నెట్టారనే కోపం వారిలో ఉన్నది. జీఎం నిర్లక్ష్యం వల్ల ఇప్పుడు లీగల్ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తున్నదనే ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలోనే విష్ణువర్ధన్‌రావును మళ్లీ కొనసాగించేందుకు ఇష్టంలేని బోర్డు ఆయనను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని నిర్ణయించింది. ఇది ఇప్పుడు వివాదంగా మారింది.

### నామమాత్రంగా బోర్డు

కార్పొరేషన్‌లో బోర్డు పాత్ర ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీనిపై ఇప్పటికే పలుమార్లు వివాదం రేగింది. తాజా పరిణామాలతో మరోసారి బోర్డు అధికారాలపై చర్చ మొదలైంది. బోర్డు విధులేమిటి? అధికారాలేమిటి? అని సభ్యులు ప్రశ్నిస్తున్నారు. తమను ఏ కమిటీలోనూ సభ్యులుగా చేర్చడం లేదని, ఎలాంటి అధికారాలు అప్పగించడం లేదని, మొత్తంగా ఎన్నికైన బోర్డును నామమాత్రం చేసేశారని ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. కార్పొరేషన్‌లో ప్రతి నిర్ణయానికి ప్రభుత్వ అనుమతి తీసుకుంటే ఇక బోర్డు ఎందుకని ప్రశ్నించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో జీఎం సరెండర్ అంశం, బోర్డు అధికారాల వివాదం ఎక్కడికి దారితీస్తుందోననే చర్చ జరుగుతున్నది.

## 'ఆల్మట్టి నీటి తరలింపును ఒప్పుకోం'

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): గోదావరి-కావేరి నదుల అనుసంధానంతో కర్ణాటకకు కేటాయించిన 16 టీఎంసీల నీటిని ఆల్మట్టి నుంచి తరలించే ప్రతిపాదనలను ఒప్పుకోబోమని రాష్ట్రసర్కారు స్పష్టం చేసింది. అదే జరిగితే తమ రాష్ట్రంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు గోదావరి-కావేరి నదుల అనుసంధానం ప్రతిపాదనలను పునఃపరిశీలించాలని ఎన్‌డబ్ల్యూడీఏను కోరింది. ఈ నేపథ్యంలో ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మన్‌కు సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా సోమవారం లేఖ రాశారు. మరోవైపు తెలంగాణ వాటాను గతం కన్నా తగ్గించారని ఆయన ఆక్షేపించారు. 50 శాతానికి తగ్గకుండా నీటి కేటాయింపులు చేయాలని నివేదించారు. ఇచ్చంపల్లి వద్ద బరాజ్ కట్టాలని ప్రతిపాదించారని, దాని వల్ల తుపాకులగూడెం బ్యాక్‌వాటర్ వస్తుందని, అదే జరిగితే నీటి నిల్వసామర్థ్యం తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈఅంశాలను పరిగణనలోకి తీసుకొని నిర్ణయం తీసుకోవాలని ఎన్‌డబ్ల్యూడీఏకు రాహుల్ బొజ్జా విజ్ఞప్తి చేశారు.

## 'కాళేశ్వరం' జ్యుడీషియల్ విచారణపై క్యాబినెట్‌లో చర్చ

హైదరాబాద్, మార్చి11 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టుపై జ్యుడీషియల్ విచారణ అంశాన్ని మంగళవారం జరగనున్న క్యాబినెట్ సమావేశంలో చర్చించే అవకాశమున్నది. ఇదే విషయాన్ని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఇటీవల పలు సందర్భాల్లో వెల్లడించారు. ఇప్పటికే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం చేపట్టిన ప్రాథమిక విచారణ నివేదికను అందజేసింది. మరోవైపు కాగ్ నివేదిక, ఎన్‌డీఎస్‌ఏ నివేదికల ఆధారంగా విచారణ కొనసాగించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. హైకోర్టు లేదంటే సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తితో కూడా ప్రాజెక్టుపై సమగ్ర విచారణ చేయించాలని నిర్ణయించింది. విచారణాంశాలు, విధివిధానాలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.